WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguj yothidaily.com

PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 02 | సంచిక: 43 | ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ | బుధవారం17 జూన్ 2026 | పేజీలు : 6 | వెల : 4-00

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA,SRIKAKULAM

## స్టాక్ మార్కెట్లు పతనం..


852 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్..

205 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ




## మమత వర్గంతో చర్చించాకే

- టీఎంసీ రెబల్ ఎంపీల విలీనంపై స్పీకర్ నిర్ణయం!
- తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ముదిరిన సంక్షోభం
- తాము ఎన్‌సీపీఐ పార్టీలో విలీనమైనట్లు ప్రకటించిన టీఎంసీ రెబల్ ఎంపీలు
- ఈ విషయంపై త్వరలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకునే ఛాన్స్



## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

- బెడ్ కింద భారీగా నోట్ల కట్టలు
- ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసంలో ఏసీబీ సోదాలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- నరహరి నివాసం, కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- 11 ప్రాంతాల్లో తనిఖీలు



**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో చేపట్టిన సోదాల్లో కళ్లు చెదిరే స్థాయిలో అక్రమాస్తులు బయటపడ్డాయి. ఏకంగా రూ. 1.54 కోట్లు, కిలో బంగారం భారీగా స్థిరచరాస్తుల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్య కాలంలో ఏసీబీ దాడుల్లో ఇంట్లో అత్యధికంగా నగదు పట్టుబడిన కేసు ఇదేనని అధికారులు చెబుతున్నారు. అక్రమంగా - మిగతా3లో



## ఆధార్?ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు
- ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించాలి
- పౌరసత్వ రుజువుగా వాడకూడదంటూ పిటిషన్

## సన్నవడ్ల విత్తనాలను
# సబ్సిడీపై ఇవ్వాలి

- వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలని ఆదేశం
- ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలి



**హైదరాబాద్**

విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా - మిగతా3లో



## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

- నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆన్‌లైన్ ప్రచారాలను నమ్మవద్దు
- అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలి
- నీట్ రీ ఎగ్జామ్ వేళ పలు సూచనలు చేసిన ఎన్‌టీఏ
- అందుబాటులో ఆన్‌లైన్ పోర్టల్

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..
## కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి




## హైదరాబాద్ మెట్రోపై
# మాకు వివక్ష లేదు



- రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు
- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా

**హైదరాబాద్**

గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ. 1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితువు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తాము రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా - మిగతా3లో



## జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

- ప్రధాన్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందే: ఖర్గే
- టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం కాదు
- కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన మంత్రిని తొలగించండి
- మోదీ ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

## తెలంగాణకు ఊపిరితిత్తులు
# ఈ రెండు జిల్లాలే

- ఈ జిల్లాలో ఒక శాతమూ అడవుల్లేవ్?!
- రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో అసమానతలు
- 0.15 శాతం అడవులను కలిగి ఉన్న కరీంనగర్
- హైదరాబాద్‌లో అటవీ సంపద ఆందోళన కలిగించడానికి కారణమేంటంటే?




**హైదరాబాద్**

అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా? పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే 'తెలంగాణకు ఊపిరితిత్తులు' గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్ - మిగతా3లో

# మమత వర్గంతో చర్చించాకే

టీఎంసీ పార్టీ రెబల్ ఎంపీలు తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో (ఎన్‌సీపీఐ) విలీనమయ్యామని, తమకు లోక్‌సభలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరిన నేపథ్యంలో ఆయన నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఎంపీల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఈ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి. కాగా, టీఎంసీ లోక్‌సభ సభ్యుల బృందంలో అధికారికంగా చీలిక ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ఇటీవలే తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు ప్రకటించారు. తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. తమకు తృణమూల్ మొత్తం ఎంపీల్లో 2/3వంతుకు మించి మెజారిటీ ఉందన్నారు. అందుకే ముందడుగు వేస్తున్నామని, ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏతో కలిసి దేశం కోసం పని చేస్తామని వివరించారు. ఈ పరిణామంపై టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ స్పందించారు. ఈ చర్యను తప్పుదోవ పట్టించేది, అప్రజాస్వామికమని మండిపడ్డారు. టీఎంసీ పార్టీ పూర్తిగా మమతా బెనర్జీ



నాయకత్వంలోనే ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటరీ స్థాయిలో అసలు ఉనికి లేని పార్టీలో టీఎంసీ రెబల్ ఎంపీలు ఎలా విలీనం అవుతారు? అని ప్రశ్నించారు. పదవుల కోసం రెబల్ ఎంపీలు తమలో తాము కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

**'మమతదే టీఎంసీ పార్టీ'**

"నిజమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మమతా బెనర్జీదే. టీఎంసీ మమతదేనని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాం. 20 మంది తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు స్పీకర్‌కు ఇచ్చిన లేఖ తప్పుదోవ పట్టించేలా ఉంది. తిరుగుబాటు ఎంపీల బృందం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. ఇప్పటికే వారిలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. ఎవరు మంత్రి కావాలనే విషయంలో ఆ ద్రోహుల (తిరుగుబాటు టీఎంసీ ఎంపీలనుద్దేశించి) మధ్య వివాదం నెలకొంది. రెబల్ ఎంపీలు విలీనం అయిన పార్టీ(నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కి పార్లమెంట్‌లో ఎలాంటి ప్రాతినిధ్యం లేదు, అది గుర్తింపు లేని, రిజిస్టర్ కాని పార్టీ. దానికి ఎలాంటి ఉనికి లేదు. ఆ పార్టీలో తిరుగుబాటు టీఎంసీ ఎంపీల విలీనం ప్రజాస్వామ్యబద్ధం కాదు. " అని కీర్తి ఆజాద్ తెలిపారు.

**వార్తల్లో నిలిచిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా**

ఏమాత్రం పేరు ప్రఖ్యాతులు లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. అందుకు ప్రధాన కారణం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది తిరుగుబాటు ఎంపీలు అందులో విలీనం కావాలని నిర్ణయించుకోవడమే. ఈ పార్టీకి ఎంపీ, ఎమ్మెల్యేలు గానీ లేరు. కాగా, 2023లో జరిగిన త్రిపుర శాసనసభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా బరిలోకి దిగింది. పార్టీ ఫిరాయింపులు చేసే వారిని తిరస్కరించాలన్న నినాదంతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారం చేసింది. పోటీ చేసిన మూడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడిగా బంగాల్‌కు చెందిన ఉట్టియ కుందు ప్రస్తుతం సేవలందిస్తున్నారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు చేసిన ప్రతిపాదనకు స్పీకర్ ఓంబిర్లా ఆమోదముద్ర వేస్తే లోక్‌సభలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఐదో పెద్ద పార్టీగా నిలుస్తుంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తొమ్మిదో స్థానానికి పడిపోతుంది.

# జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

పేపర్ల లీకేజీ, పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోదీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూన్ 21న జరగనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఆయన ఎక్స్ వేదికగా తప్పుపట్టారు. "నీట్ రీ-టెస్ట్ కోసం మోదీ సర్కార్ టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసింది. కానీ కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన తమ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని రాజీనామాను ప్రధాని మోదీ కోరాలి. దేశంలోని చైతన్యవంతులైన యువత కేవలం ఒక్కటే డిమాండ్ చేస్తున్నారు. అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఇది జవాబుదారీతనానికి మొదటి పరీక్షగా మారింది. దురదృష్టవశాత్తు బీజేపీ ఈ పరీక్షలో పూర్తిగా విఫలమైంది."

**మాఫియాను రక్షించే ప్రయత్నం!**

"భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించడం, టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం లేదా పేపర్ లీక్? మాఫియాను రక్షించేందుకు చిన్న చేపలను పట్టుకోవడం- ఇవన్నీ మోదీ ప్రభుత్వం చేయాల్సి వస్తోంది. ఎందుకంటే గత 10 ఏళ్లలో 90 పేపర్ లీక్‌లు జరిగాయి. ఈ మోసం, అవినీతి వల్ల 9 కోట్ల మంది యువత నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఇంకెంత కాలం కప్పిపుచ్చుకుంటుంది" అని ఖర్గే



ప్రశ్నించారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. "మోదీ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. తమ పిల్లలను రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు భారీగా అప్పులు చేసిన ఎంతో మంది తల్లిదండ్రులు ఉన్నారు. తీరా చూస్తే, ఒకదాని తర్వాత ఒకటిగా నీట్, ఎస్ఎస్‌సీ, యూజీసీ-నెట్, సీయూఈటీ, ఇతర పరీక్షల పేపర్లు లీక్ అవుతున్నాయి" అని ఖర్గే విమర్శించారు. "పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, సీబీఎస్?ఈ ఫలితాల్లో ఎంత మోసం జరిగిందంటే, ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ ప్రభుత్వ తీరును బట్టబయలు చేశారు. ఇక ఇప్పుడు అత్యంత విశ్వసనీయతకు చిహ్నంగా భావించే యూపీఎస్?సీ పరీక్ష కూడా ఆరోపణల పరిధిలోకి వచ్చింది" అని ఖర్గే ఆరోపించారు.

**రాహుల్ గాంధీ విద్యార్థి సదస్సులు**

పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఈ విషయంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి లోకాన్ని ఏకం చేసే ప్రయత్నాల్లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జూన్ 17 నుంచి రాజస్థాన్?లోని కోటా నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థి సదస్సులు నిర్వహించనున్నారు.

**ప్రతి ఒక్కరూ విద్యార్థులకు అండగా నిలవాలి: ప్రియాంక గాంధీ**

పేపర్ లీకేజ్, పరీక్షల అక్రమాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తన సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను, ఆవేదనను అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు.

"ప్రజా బాధ్యత కలిగిన మనమందరం విద్యార్థులకు అండగా నిలబడాలి. వారు ఎలాంటి ఇబ్బందులు, బాధలు అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఇక్కడ ప్రతి పేపరూ లీక్? అవుతోంది. వారి తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. ఈ సమస్య ఏదో ఒక చోట, ఒకరికి మాత్రమే జరిగింది కాదు. ఇది తక్షణం పరిష్కరించాల్సిన ఒక లోతైన వ్యవస్థాగత సమస్య. మనం కచ్చితంగా మార్పు తీసుకురావాలి." విద్యార్థుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, పదేపదే జరుగుతున్న పరీక్షల అక్రమాలు, లీకేజీల వల్ల వారి తల్లిదండ్రుల కష్టార్జితం వృథా కాకుండా చూడడానికి పరీక్షల విధానంలో సమగ్ర మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రియాంక గాంధీ నొక్కిచెప్పారు.

# నీట్ రీ-ఎగ్జామ్ పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అలర్ట్ జారీ చేసింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని విద్యార్థులను సూచించింది. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, మోసపూరిత ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్‌టీఏ ఒక ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎవరైనా ఎగ్జామ్ ప్రశ్నాపత్రాలు ఇస్తామని డబ్బులు అడిగినా, లేదా లీక్ అయిందని తప్పుడు ప్రచారం చేసినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అటువంటి మోసగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌టీఏ హెచ్చరించింది.

**ఆన్‌లైన్ మోసాలపై నిఘా**

ఇదిలా ఉండగా, నీట్ రీ ఎగ్జామ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు అధికారులు అన్ని రకాలు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ మోసాలపై పర్యవేక్షణను కఠినతరం చేశారు. నీట్ పరీక్షా పత్రాలు తమ వద్ద ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తూ, అభ్యర్థులను మోసం చేయడానికి కొన్ని మోసపూరిత ముఠాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రయత్నిస్తున్నాయని ఎన్‌టీఏ తెలిపింది. అయితే, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎవరికీ అందుబాటులో ఉండదని, పేపర్ తయారీ, నిల్వ, రవాణా వంటి ప్రక్రియల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

**అందుబాటులో అడ్మిట్ కార్డులు**

ఇక, నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. వెబ్‌సైట్ ప్రారంభమైన మొదటి 24 గంటల్లోనే 10 లక్షల



మందికి పైగా అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎన్‌టీఏ పేర్కొంది. కొన్నిచోట్ల డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది. అయితే, సాంకేతిక సమస్యలు, సర్వర్‌పై అధిక భారం కారణంగానే ఈ సమస్య తలెత్తిన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సమస్యలను పరిష్కరించే దిశగా తమ బృందం పనిచేస్తుందని పేర్కొంది.

మరోవైపు, రీఫండ్ విషయంలోనూ అభ్యర్థులకు ఎన్?టీఏ పలు సూచనలు చేసింది. అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే ముందు, తమ బ్యాంక్ ఖాతా వివరాలను సరిచూసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. కాగా, దేశవ్యాప్తంగా జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్ జరగనుంది. దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

**15 నిమిషాల పొడగింపు**

ఇక, పరీక్ష నియమావళిలో ఎన్?టీఏ కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాన్ని మరో 15 నిమిషాలు పొడగిస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. పరీక్ష ప్రారంభానికి ముందు, తర్వాత ఇన్విజిలేషన్? ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 15 నిమిషాల వరకు పరీక్ష జరగనున్నట్లు పేర్కొంది. అయితే, అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. వీటితోపాటు ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్‌కోసం కేటాయించిన పేజీల సంఖ్యను, రెండు నుంచి నాలుగుకు పెంచినట్లు తెలిపింది. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రశ్నాపత్రం మొదట్లో, చివర్లో రెండేసి రఫ్ పేపర్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

**టెలిగ్రామ్‌పై ఆంక్షలు**

మరోవైపు, ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్టవేయాలనే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో టెలిగ్రామ్ యాక్సెస్‌ను జూన్ 22 వరకు తాత్కాలికంగా ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. ఎన్‌టీఏ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, నీట్ రీ ఎగ్జామ్?కు ముందు తప్పుడు ప్రచారాలు, వ్యవస్థీకృత మోసాల నెట్‌వర్క్‌లను నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఏజెన్సీ తెలిపింది.

## ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ జారీ చేసే ఆధార్ కార్డులను పౌరసత్వం, స్థానికత, నివాస చిరునామా రుజువులుగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం, అడ్వకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్‌ను ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది. ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా ఉపయోగించేలా పరిమితం చేయాలని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ కోరారు. దీనిని పౌరసత్వం, స్థానికత, చిరునామా, పుట్టిన తేదీకి రుజువుగా వాడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్నికల సంఘానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. న్యాయవాది అశ్వినీ దూబే ద్వారా ఈ పిటిషన్?ను సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారమ్‌లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా ఆధార్‌ను ఉపయోగించడానికి పిటిషనర్ సవాల్ చేశారు. ఇది ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్? 9, ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)- 1950లోని సెక్షన్? 23(4), రాజ్యాంగంలోని ఆర్టికల్? 14కు విరుద్ధమని పేర్కొన్నారు.

**అక్రమ చొరబాటుదారులకు వరంగా మారింది!**

"ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 చాలా స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వం లేదా స్థానికతకు రుజువు కాదు అని చెబుతోంది. అలాగే 2023 ఆగస్టు 22 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్ అనేది గుర్తింపునకు మాత్రమే రుజువు, పౌరసత్వం, చిరునామా, పుట్టిన తేదీకి కాదు అని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ పాఠశాల ప్రవేశాలు, ఆస్తి కొనుగోళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వయస్సు, పౌరసత్వం, స్థానికత రుజువుగా ఆధార్‌ను ఉపయోగిస్తున్నారు. అంతేకాదు కొత్త ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్ (ఫారమ్-6)లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా కూడా వాడుతున్నారు. దీని వల్ల చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్?ను ఉపయోగించి వివిధ రకాల అధికార పత్రాలు పొందుతున్నారు" అని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫారమ్-6 కింద చేస్తున్న వెరిఫికేషన్ విధానం చాలా లోపభూయిష్టంగా ఉందని, సరైన పత్రాలు లేని వ్యక్తులు కూడా ఓటర్ల డేటాబేస్?లో చేరిపోయే ప్రమాదం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే వెరిఫికేషన్ విధానాన్ని సమూలంగా పునర్వ్యవస్థీకరించాలని ఆయన కోరారు. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో పాటు, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన హై-పవర్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విదేశీయులు కూడా ఆధార్ పొందవచ్చు!**

ఆధార్ చట్టం ప్రకారం, విదేశీ పౌరులతో సహా దేశంలోని నివాసితులు అందరూ ఆధార్ కార్డు పొందే హక్కు ఉందని పిటిషనర్ అన్నారు. ఓ వ్యక్తి ఒక ఏడాదిలో 182 రోజులు భారతదేశంలో నివసిస్తే, ఆధార్ కార్డు పొందడానికి అర్హత వచ్చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అద్దె ఒప్పందాలు, స్థానిక అధికారుల సిఫారసులు వంటి పత్రాల ఆధారంగా ఎన్‌రోల్మెంట్ కేంద్రాల నుంచి ఆధార్ పొందవచ్చని తెలిపారు. అందుకే ఈ లూప్? హోల్స్‌ను ఆసరాగా చేసుకొని అక్రమ వలసదారులు, చొరబాటుదారులు ఆధార్?ను సంపాదిస్తున్నారని, ఆ తర్వాత దానిని ఉపయోగించి ఓటరు గుర్తింపు కార్డుతో సహా ఇతర గుర్తింపు పత్రాలను కూడా సులభంగా పొందగలుగుతున్నారని తన పిటిషన్?లో పేర్కొన్నారు. కనుక ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్?ను కేవలం గుర్తింపును నిరూపించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, వయస్సు, నివాసానికి రుజువుగా వాడకూడదని పిటిషనర్ పేర్కొన్నారు. ఆధార్ ఉపయోగించి దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల వల్ల ఎన్నికల్లో పారదర్శకత లేకుండా పోతోందని అన్నారు. జనాభా మార్పులు (డెమోగ్రాఫిక్ ఛేంజ్) వస్తున్నాయని, దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## టెలిగ్రామ్‌పై కేంద్రం కీలక నిర్ణయం నీట్ పరీక్ష అయ్యే వరకు బ్యాన్

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. 2026 జూన్ 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవల పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్? రోజుతో పాటు ఆ తర్వాతి రోజు వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయి. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అయితే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే సదుపాయాన్ని కూడా జూన్ 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాలను పాత సందేశాల్లో జతచేసి, అవి ముందుగానే లీక్ అయ్యాయని తప్పుడు ఆధారాలు సృష్టించే ఘటనలు ఇటీవల పెరిగినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నిర్వాహకులు పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రాన్ని పాత పోస్టుల్లో జతచేసి, వాటి స్క్రీన్‌షాట్లను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపింది. టెలిగ్రామ్‌ను విద్య, ఉద్యోగ, వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే లక్షలాది మంది వినియోగదారులకు ఈ నిర్ణయం కొంత అసౌకర్యం కలిగించవచ్చని ఎన్‌టీఏ అంగీకరించింది. అయితే పరీక్షల పారదర్శకత, భద్రత కోసం ఈ చర్యలు తప్పనిసరి అయ్యాయని తెలిపింది.

**జూన్ 21న రీ-ఎగ్జామ్**

దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. దీంతో లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఈ నేపథ్యంలో జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే రీటెస్ట్ పేపర్ కూడా లీక్ అయిందంటూ వదంతులు వ్యాపించాయి. వాటిని ఇప్పటికే ఎన్‌టీఏ ఖండించింది. నీట్ రీ-ఎగ్జామ్? నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జూన్ 21న జరుగుతుందని స్పష్టం చేసింది. పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ఎన్‌టీఏ ప్రకటనలు, వెబ్‌సైట్‌ను మాత్రమే నమ్మాలని సూచించింది. ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న తప్పుడు సమాచారాన్ని, పేపర్ లీక్ ప్రకటనలను పూర్తిగా విస్మరించాలని కోరింది.

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

-మొదటిపేజీ తరువాయి

పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.

### ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించాం

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించింది : మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు



రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.

### ప్రాజెక్టులకు సహకరిస్తాం

ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. డొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు.

"మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో-1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి" - కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు..




సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

# సింగూరు డ్యామ్‌కు డేంజర్ బెల్స్

**మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది.ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్మెంట్ ఏరియాల



నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్‌ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పకీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యామెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్‌ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

## సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

### రైతుల వివరాల నమోదు

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం ఆదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.

### అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు

కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

### సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

### రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ

ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### ప్రభుత్వ డైరీ మరింత బలోపేతం

గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

## "తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే"

-మొదటిపేజీ తరువాయి

జిల్లాలు గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనివే.

### ఈ అటవీ ప్రాంతం ఆందోళన కలిగిస్తోంది

హైదరాబాద్ వంటి నగరాల్లో ఆధునిక జీవన విధానం, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ వల్ల ఎక్కువగా అడవులు క్షీణించిపోతున్నాయి. వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్? భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.08 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా ఉంది. కరీంనగర్ పరిస్థితి మరింత ఘోరం. ఇక్కడ అటవీ విస్తీర్ణం 0.15 శాతం అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో 1.5 ఎకరం మాత్రం అటవీ ప్రాంతం ఉంది. కరీంనగర్?లో అటవీ ప్రాంతం ఎంతలా దౌర్భాగ్య స్థితిలో ఉందో అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చ.కి.మీ. ఉంది. ఇందులో అటవీ ప్రాంతం 27,688 చ.కి.మీ. ఉంది. అటవీ విస్తీర్ణం అత్యధికంగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం 4,311.38 చ.కి.మీ ఉంటుంది. అత్యల్పంగా ఉన్న జిల్లా హైదరాబాద్? 1.45 చ.కి.మీ. ఉంది.

### అడవులు లేకపోవడం వల్ల కలిగే నష్టాలు

అడవులు ప్రతి రాష్ట్రంలో ఉండాల్సినంత విస్తీర్ణంల ఉండాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవల్సి ఉంటుంది. వర్షపాతం సరిగ్గా ఉండదు. వానలు కురవక, పంటలు పండక ప్రజలు కరవుతో అల్లాడిపోతారు. పశుపక్ష్యాదులకు ఆధారం ఉండదు. భూగర్భజలాలు ఎండిపోతాయి. దీంతో వాతావరణం సమతుల్యతను కోల్పోతుంది. ఎండ తీవ్రత పెరిగిపోతుంది. చల్లదనం బాగా తగ్గిపోతుంది. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. జంతువులన్నీ మనుషులు ఉండే ప్రదేశాలకు వస్తాయి. ప్రజలు భయంకర జంతువులతో భిక్కుభిక్కుమంటూ బతకాల్సి వస్తుంది. అందువల్ల చెట్లని పెంచడం, అడవి సంపదను రక్షించడం ఎంతో అవసరం.

## తెలంగాణలో ఏసీబీ మరో రైడ్

-మొదటిపేజీ తరువాయి



ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారంతో పాటు కీలకమైన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మట్నత్తం 11 చోట్ల ఆరుగురు డీఎస్పీలు 20 మంది ఇన్‌స్పెక్టర్లతో సోదాలు నిర్వహించారు. అత్తాపూర్, మియాపూర్, గచ్చిబౌలి లాంటి ఖరీదైన ప్రాంతాల్లో బినామీ పేర్లపై ఉన్న ఓపెన్ ప్లాట్లు, విల్లాలతో పాటు, రంగారెడ్డి జిల్లాలో భారీగా వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతానికి ఈ సోదాల్లో దొరికిన నగదు, నగలు, డాక్యుమెంట్ల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని, బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోదాలు చేశామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. "నరహరి ఇంట్లో రూ.1.40 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం. ఇంత భారీ నగదు ఏసీబీ దాడుల్లో ఎప్పుడూ దొరకలేదు. నరహరి ఇంట్లో కిలో బంగారం, భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. నగలు, ఆస్తుల విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుంది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, విల్లాల పత్రాలు స్వాధీనం. లాకర్లు తెరిచేందుకు బ్యాంకు అధికారులకు లేఖ రాశాం. సోదాలు పూర్తయ్యాక నరహరిని సాయంత్రం అరెస్టు చేస్తాం" ఇటీవలి కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం ఏసీబీ చరిత్రలోనే సంచలనంగా మారింది. గతంలో జలమండలి జనరల్ మేనేజర్ ఇంట్లో కోటీ పది లక్షల రూపాయలు, రెండు కిలోల బంగారం పట్టుబడగా ఆర్ అడ్ బీ ఈఎన్?సీ మోహన్ నాయక్ ఇంట్లో 65 లక్షల నగదు బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. అయితే వాటన్నింటినీ మించి ప్రస్తుతం నరహరి ఇంట్లో ఏకంగా 1.54 కోట్ల నగదు దొరకడం సంచలనం సృష్టిస్తోంది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయం కూడబెట్టిన స్థిరాస్తుల విలువలపై అధికారులు పక్కాగా లెక్కగడుతున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ అవినీతి తిమింగలం అక్రమాస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశం ఉంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

# డాక్టరేట్ అవార్డు గ్రహీత ,డీ ప్రేమానందం కు ఘన సత్కారం.



వారి గ్రామ సర్పంచ్ పంచాయతీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు.

తెలుగు జ్యోతి న్యూస్ సంగారెడ్డి ప్రతినిధి 16 జూన్.

కొండాపూర్, చర్ల గోపులారం గ్రామ సర్పంచ్ జి మహేశ్వరి సతీష్, పంచాయతీ మెంబర్ జి నవీన్, ఏ రవి పంచాయతి సభ్యులు, డి సుజాత విద్యానందం, ఎం వీరమని కిష్టయ్య, సామాజిక ఉద్యమకారులు డి ప్రేమానందం కు ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసర్చ్ అకాడమీ వారు హైదరాబాద్లో సరస్వతి పరిషత్ సమావేశంలో ద గ్రేట్ అవార్డును ఇచ్చి సత్కరించిన సందర్భంలో వారి సొంత గ్రామం గోపులారంలో హర్ష వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో






రాజశేఖర్, రాజ్ కుమార్, మధుకర్, డి అరుణ్, జి ప్రదీప్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలతో సన్మానించినారు.

# సంగారెడ్డిలో ఎస్ ఐ ఆర్ పై బూతు లెవెల్ ఏజెంట్ లా సమావేశం.







కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.
కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ.
టీజీఐఐ సీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

తెలుగు జ్యోతి న్యూస్ 16 జూన్ సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.

సంగారెడ్డి టౌన్ లో టి పి సి సి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 23న ఆందోళనలో మీనాక్షి నటరాజ్ తో కలిసి ఎస్ ఐ ఆర్ పై మరో సమావేశ ఉంటుందని తెలియజేశారు. మన దేశం యావత్తు ప్రపంచంలో ప్రజాస్వామ్యం కలిగిన దేశం అన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ,ప్రక్రియ మాత్రం వాళ్లకి ఓటు పొడవు అన్న ఓట్లను తొలగిస్తుంది అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ బిజెపికి వత్తాసు పలుకుతుందన్నారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా (ఎస్ ఐ ఆర్) ప్రక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందన్నారు. బెంగాల్ లో, ఎస్ ఐ ఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారు అన్నారు. ఎస్ ఐ ఆర్ లో మంత్రి దామోదర రాజనర్సింహ, తూర్పు జగ్గారెడ్డి నా ఓటు గల్లంతైన ఆశ్చర్యం లేదు అన్నారు. మా ఓట్లు క్షేమంగా ఉండాలంటే( బి ఎల్ ఏ) కీలకంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయాల్లో దామోదర నాకు వనమాలు నేర్పించారు అని తెలియజేశారు. ఈ దేశంలో అతికొద్ది నిజాయితీ పనుల్లో ఒకరు మీనాక్షి నటరాజన్ అని కొనియాడారు. అకారణంగా ఆమె నామినేషన్ తిరస్కరించారు. బిజెపి వాళ్ళకి కనికరం లేదు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల లాగా ఉండాలని బిజెపి నేతలు అనుకుంటున్నారు. నీకంటే పెద్ద చక్రవర్తులే నీలమట్టం అయ్యారు మోడీ, అమిత్ షాలు ఎంత అని విమర్శించారు.దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు కానీ దేవుడు పేరు చెప్పనిదే బిజెపి వాళ్లకు ఓట్లు పడవు. జై శ్రీరామ్ అనే పదం అందరికీ వర్తిస్తుంది. తూర్పు జగ్గారెడ్డి ఏడాదిలో అనేకసార్లు పూజలు చేస్తారు. కానీ దేవుళ్ళ పేరు తో ఓట్లు అడిగే వాళ్ళం మేము కాదు అన్నారు. ఏడాదికి 2 రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారు అని విమర్శించారు. ఈ దేశాన్ని ఎవరు రక్షించరు మనమే రక్షించుకోవాలన్నారు. మతం పేరుతో ప్రజలు ఓట్లు వేయరు. పదేళ్లు అధికారంలో ఉన్న 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. మేము ఇప్పటివరకు 80 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. డబుల్ బెడ్ రూమ్ లో పేరుతో మోసం చేస్తే, మేము ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాము అని తెలియజేశారు. కాంగ్రెస్ హయాంలో పి హెచ్ సి నుంచి నిమ్స్ వరకు ప్రక్షాళన చేశాం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణ వచ్చినప్పుడు పది రోజులు అన్నం తినలేదని పవన్ కళ్యాణ్ అన్నాడు. కమలం పార్టీ ఆడించినట్టే పవన్ కళ్యాణ్ ఆడుతున్నారు. మీ సానుభూతి మాకేం అవసరం లేదు మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని తెలియజేశారు.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ,టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కౌంటర్.**

సీఎం రేవంత్ అన్ని తప్పులు మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి చెబుతున్నారు. ఈ 12 ఏళ్ల లో మీరు ఏం చేశారో చిట్టా ఇవ్వండి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇంకా నిధులు రావాలి, కేంద్ర ప్రభుత్వం విభజన హామీలని ఇప్పటివరకు నెరవేర్చలేదు అన్నారు. మీరు సబర్మతి కట్టుకోవచ్చు మేము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వీటికి సమాధానం చెప్పాలన్నారు. ఓవైపు బిజెపి, మరోవైపు బి.ఆర్.ఎస్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక పోతున్నారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, పార్లమెంట్ సభ్యులు సురేష్ సెట్ కార్, నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవ రెడ్డి, తూర్పు నిర్మల జగ్గారెడ్డి డిసిసి అధ్యక్షురాలు టిజిఐఏసి చైర్ పర్సన్, తూర్పు జగ్గారెడ్డి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎం ఏ ఫహీమ్ కార్పొరేషన్ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు, క్రియాశీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకమ్మగూడలో గ్రామ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ జన్మదిన వేడుకలు"







ఉప సర్పంచ్ వడ్డే యాదయ్య ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానం

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 16

నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలో సర్పంచ్ గొల్లపల్లి అశోక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచ్ వడ్డే యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువకులు, గ్రామ పెద్దలు కలిసి సర్పంచ్ అశోక్‌ను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అశోక్ అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ ప్రగతికి కృషి చేస్తున్న నాయకుడిగా కొనియాడారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, బి కాలనీ వాసులు, వడ్డే బ్రదర్స్, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.సర్పంచ్ అశోక్ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీత ప్రేమానందం కు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించిన గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంతరెడ్డి .



తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 16 తెలుగు జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.

సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం చర్ల గోపులారం గ్రామానికి చెందిన, గౌరవ డాక్టరే ట్ అవార్డు గ్రహీత డి ప్రేమానందం కు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించిన బి ఆర్ ఎస్ యువ నాయకులు, గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంతరెడ్డి, సి కృష్ణమూర్తి యాదవ్ బి ఆర్ ఎస్ నాయకులు బీసీ సంక్షేమ సంఘం యువ జన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వారితోపాటు రఘునాథ్ రెడ్డి అనంతసాగర్ మాజీ ఉపసర్పంచ్, కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డి, చారి తదితరులు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించినారు.

## ముదిరాజ్ భవన ప్రారంభోత్సవానికి సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డికి ఆహ్వానం.



తెలుగు జ్యోతి న్యూస్ 16 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈనెల 19న జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ సంఘం అధ్యక్షులు, కె మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం భవన ప్రారంభోత్సవ అని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ,రాజు ముదిరాజ్, ఎం ఆంజనేయులు ముదిరాజ్, ఎన్ సాయి ముదిరాజ్, కే రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నోట్ల కట్టలపైనే నరహరి నిద్ర

**హైదరాబాద్ :** తనిఖీలు చేపట్టారు. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇళ్లు, ఆస్తులపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు రావడంతో ఉదయం నుంచే నరహరి నివాసాలు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాకలో ఉన్న నరహరి నివాసంతో పాటు ఆయన ఆఫీసు, బంధువుల ఇళ్లు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 11 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు చేశారు.ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో భారీగా నగదు లభ్యమైంది. దాదాపు 1.10కోట్ల నగదును ఏసీబీ గుర్తించింది. పడక గదిలో బెడ్ కింద నగదు స్వాధీనం చేసుకున్నారు. నోట్ల కట్టలను బెడ్ గా చేసుకుని అధికారి నిద్రిస్తున్నాడని గుర్తించిన ఏసీబీ అధికారులు షాకవుతున్నారు. ఏసీబీ అధికారులు ఈ సోదాల్లో భాగంగా నరహరి ఇళ్లలో లభ్యమైన భారీ నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని ఏసీబీ ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారి నివాసంలో ఒకేసారి ఇన్ని చోట్ల ఏసీబీ దాడులు జరగడం రెవెన్యూ, భూ సర్వే విభాగాల్లో కలకలం రేపుతోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రెవెన్యూ శాఖలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి ఆర్డీవోగా పనిచేసిన సమయంలో వంశీ మోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం, మ్యుటేషన్ల కోసం రియల్టర్ల నుండి తన బంధువుల పేర్లపై 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ల రూపంలో ముడుపులుగా తీసుకోవడం వంటి కీలక అక్రమాలను అధికారులు గుర్తించి, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## వరంగల్ కు పవన్


**వరంగల్:** పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ కారణం ఉంది. బుధవారం రోజు వరంగల్ హనుమకొండలో మృత్యువుతో పోరాడుతున్న తన వీరాభిమాని నిరంజన్ చివరి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ అతని ఇంటికి వెళ్లను పవన్ కళ్యామ్‌ను ? చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి . ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పవన్ కళ్యాణ్‌కు మధ్య తీవ్రమైన వాగ్వాదం నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించడం వివాదానికి కేంద్ర బిందువైంది.

# ప్రజా సమస్యలే తన అజెండా పేద ప్రజలే తన కుటుంబం.

**సామాజిక ఉద్యమ నేత డీ ప్రేమానందం కు గౌరవ డాక్టరేట్.**
**సామాజిక ఉద్యమ కార్యకర్త డి ప్రేమానందం కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్.**
**రైతులు విద్యార్థులు పేదలు గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం మూడు దశాబ్దాలుగా సేవలు.**
**తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర నిరాహార దీక్షలు రాస్తారోకోలు ధర్నాలు నిరంతర పోరాటం.**
**అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలను చేయించిన ప్రేమానందం.**





సంగారెడ్డి తెలుగు జ్యోతి న్యూస్
జూన్ 16 సంగారెడ్డి ప్రతినిధి.

తెలంగాణ సరస్వతి పరిషత్ హైదరాబాద్ లో ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసర్చ్ అకాడమీ వారు నిర్వహించిన సమావేశంలో గౌరవ డాక్టరేట్ డి ప్రేమానందం కు ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం చర్ల గోపులారం గ్రామానికి చెందిన,డీ ప్రేమానందం సుమారుగా గత మూడు దశాబ్దాలుగా సామాజిక కార్యకర్తగా సామాజిక సేవ, ప్రజా సంక్షేమం, విద్యార్థుల హక్కులు, గ్రామీణ అభివృద్ధి, విద్యుత్ సమస్యపై, మంచినీటి సమస్య, పేదరిక నిర్మూలన కోసం, ప్రజా సమస్యలపై ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించిన సామాజిక సేవకులు డీ ప్రేమానందం కు అరుదైన గౌరవం దక్కింది. ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ కు ఆయన ఎంపికయ్యారు. గోపులారం గ్రామానికి చెందిన డి ప్రేమానందం చిన్న వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. డి శాంతమ్మ రత్నయ్య దంపతుల తృతీయ సంతానంగా జన్మించిన చిన్ననాటి నుంచే విద్యార్థి దశ నుంచే సమాజ సేవ పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. వారి తండ్రిగారైన స్వర్గీయ రత్న గారు సుమారు చర్ల గోపులారం పంచాయతీ మెంబర్గా 50 సంవత్సరాలు పని చేసినారు. వారి వారసులు ప్రేమానందం సామాన్య ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. గౌతమ బుద్ధుడు, స్వామి వివేకానంద, స్వాతంత్ర సమర యోధులు, మహనీయులు, జాతిపిత మహాత్మ గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్, వారి ఆశయాలకు అనుగుణంగా, వారి సిద్ధాంతాలను అనుసరిస్తూ, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ రైతు మిత్ర సంఘం, బాబు జగ్జీవన్ రామ్ ప్రజా సంఘం, ఎస్సీ ఆర్ పి సొసైటీ, ఎం ఆర్ పి ఎస్, వివిధ ప్రజా సంఘాలతో పాటు, సదాశివపేట ఏ ఎం సి డైరెక్టర్ గా, ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ కమిటీ డైరెక్టర్ గా, పనిచేశారు. 1990లో బహుజన సమాజ్ పార్టీ మాన్య శ్రీ కాన్సిరాం ఆశయాలకు సిద్ధాంతాలకు ఆకర్షితుడై బహుజన సమాజ్ పార్టీలో పని చేశారు. 1995 లో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు వారి సిద్ధాంతాలకు ఆశయాలు నచ్చి తెలుగుదేశం పార్టీలో సుమారుగా 25 సంవత్సరాలు పని చేశారు. తదనంతరం కల్వకుంట్ల తారక రామారావు తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకులు తెలంగాణ సాధనకై ఉద్యమం చేపట్టిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో పనిచేస్తూ బి ఆర్ ఎస్ లో పనిచేశారు. వివిధ ప్రజా సంఘాల లో రాజకీయ పార్టీలలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై ఉద్యమం చేస్తూ, ప్రజలకు సేవలందిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో ఆర్టీసీ రవాణా రవాణా సౌకర్యం కల్పించడం, రహదారుల నిర్మాణం, ఇంటర్నల్ ఫార్మేషన్ రోడ్ల మంజూరు కి, మంచినీటి సమస్యపై, మంచినీటి పైప్ లైన్ల పై, విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల కోసం, విద్యుత్ స్తంభాల కోసం, రైతుల పొలాల వద్దకు ఫార్మేషన్ రోడ్డు నిర్మించడం కోసం, వంటి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం కృషి చేశారు. గ్రామంలో శ్రమదానంలో భాగంగా మురికి కాలువలు శుభ్రం చేయడంలో, మురికి కాల్వలో క్రిమిసంహారక క్రిమి కీటకాల మందు పిచికారి చేయించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. కరోనా సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యులతో మాట్లాడి డాక్టర్ల తో వైద్యం చేయించడంలో చురుకైన పాత్ర పోషించారు. దాతలను సంప్రదించి మందులు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఎదుటివారి సమస్యలు తమ సమస్యలుగా భావించి మానవత్వం చాటుకున్నారు. పేద ప్రజలు అనారోగ్యాలకు గురైతే ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలకు తరలించి వైద్యం అందేలా చేయడంలో విశేష కృషి చేశారు. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించేలా రైతుల పక్షాన మాట్లాడారు. పొలాల వద్దకు వెళ్లేందుకు రహదారులు నిర్మించేలా అధికారులను ఒప్పించి రైతులకు మేలు చేశారు. సదాశివపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్గా పనిచేసిన సమయంలో కొండాపూర్ మండలంలో వివిధ గ్రామాలకు ( లింకు రోడ్లు) ఫార్మేషన్ రోడ్లు వేయించడం జరిగింది. సదాశివపేట మార్కెట్ కమిటీ నుంచి సుమారుగా కోటి రూపాయలు మంజూరు చేయించి కొండాపూర్ టు తేర్పాల్, గోపులారం నుంచి పొలాల వద్దకు, మల్లేపల్లి నుంచి పొలాల వద్దకు, మల్కాపూర్ నుంచి వీరభద్రుని పల్లె వరకు మార్కెట్ కమిటీ నిధుల ద్వారా ఫార్మేషన్ రోడ్లు నిర్మించుటకు అధికారుల నుంచి నిధులు మంజూరు చేయించి రహదారుల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి రైతులకు మేలు చేశారు. ప్రజా సమస్యలపై అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుటలో చురుకుగా పనిచేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్గా పనిచేసిన సమయంలో హాస్టల్లో చదువుతున్న ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల సమస్యలను గుర్తించి జిల్లా ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి సమస్యలను గుర్తించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాటాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమం కోసం చేసిన సేవలు ప్రశంసలు అందుకు న్నాయి. తెలంగాణ ఉద్యమంలో కూడా కీలక పాత్ర పోషించిన ప్రేమానందం రాష్ట్ర సాధన వరకు ఉద్యమ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. నేటికీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను కలుస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్నారు. కుల,మత ,వర్గ భేదాలకు అతీతంగా అన్యానికి గురైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రిసర్చ్ స్ఫూర్తి అకాడమీ ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక డాక్టరేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ గూడూరు చిన్నారెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, లయన్ డాక్టర్ షేక్ కుసానా బేగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు. డాక్టర్ భీమా గారి యాదగిరి గౌడ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బీసీ సంక్షేమ సంఘం, డాక్టర్ సరిత, డాక్టర్ గోవర్ధన్, మానవ హక్కుల సంఘం మహిళా జాతీయ అధ్యక్షురాలు, డాక్టర్ నజీర్ ఖాన్, (ఎడిటర్ నేటి సామాన్యుడు తెలుగు దినపత్రిక) తదితర ప్రముఖులు పాల్గొని సాధారణ రైతు కుటుంబం నుంచి ఎదిగిన ప్రజా సమస్యల పరిష్కారమే జీవిత లక్ష్యంగా పనిచేస్తున్న డి ప్రేమానందం కు లభించిన ఈ గౌరవ డాక్టరేట్ సంగారెడ్డి జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. డీ ప్రేమానందం డాక్టరేట్ అవార్డు గ్రహీత మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుంచి ప్రజా సమస్యలపై ప్రజా సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం పనిచేయడం జరిగింది, డాక్టరేట్ అవార్డు , మెమెంటో, శాలువాతో సత్కరించి నందుకు డాక్టర్ ఆకుల రమేష్ కి, ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కౌన్సిలర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ బృందానికి వారి కమిటీ సభ్యులకు, నాకు అవార్డు ఇచ్చి మరింత బాధ్యత పెంచారని భావిస్తూ, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అని తెలియజేశారు. ఇక మునుముందు కూడా రెట్టింపు బాధ్యతతో ప్రజా సమస్యలపై ప్రభుత్వ అధికారుల ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కరించుట కృషి చేస్తానన్నారు.

## చెత్తకు చెత్తబుట్టే అడ్రస్... రోడ్డు కాదు: సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అమీన్‌పూర్ సర్కిల్

**చెత్త రహిత అమీన్‌పూర్‌కు ప్రజల సహకారం అవసరం**
**ప్రజాసేవలో అధికారులు... బాధ్యతలో ప్రజలు భాగస్వాములు కావాలి**

అమీన్‌పూర్, జూన్ 16 (తెలుగు జ్యోతి):




అమీన్‌పూర్: పరిశుభ్రమైన పరిసరాలు ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా అని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అమీన్‌పూర్ సర్కిల్ అధికారులు పేర్కొన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు రోడ్లు, ఖాళీ స్థలాలు, కాలువల పక్కన చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు.

అధికారులు మాట్లాడుతూ, “మేము ప్రజాసేవ చేయడానికి ఇక్కడ ఉన్నాం. పరిశుభ్రమైన అమీన్‌పూర్ నిర్మాణానికి ప్రజల సహకారం కూడా అంతే అవసరం. అధికారులు ఎంత కష్టపడినా ప్రజలు సహకరించకపోతే స్వచ్ఛత లక్ష్యం సాధ్యం కాదు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలి” అని కోరారు. చెత్తను నిర్దేశిత చెత్తబుట్టల్లో మాత్రమే వేయాలని, తడి చెత్త -- పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.1,000 నుండి రూ.10,000 వరకు జరిమానాలు విధించనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, పరిశుభ్రమైన కాలనీలు, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. “మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. చెత్తను సరైన విధంగా నిర్వహిస్తేనే వ్యాధులకు దూరంగా ఉండగలం” అని పేర్కొన్నారు. స్వచ్ఛమైన అమీన్‌పూర్.ఆరోగ్యకరమైన అమీన్‌పూర్” లక్ష్యంగా అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అమీన్‌పూర్ సర్కిల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కిష్టారెడ్డిపేట పటేల్‌గూడ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అనాధలకు సేవా కార్యక్రమం






అమీన్పూర్, జూన్ 16: తెలుగు జ్యోతి

సమాజ సేవే పరమోన్నత ధర్మమనే భావనతో కిష్టారెడ్డిపేట పటేల్‌గూడ నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదర్శవంతమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమీన్పూర్‌లోని ఓ అనాధ ఆశ్రమాన్ని సందర్శించిన సంఘం సభ్యులు అక్కడి ఆశ్రయితలకు తమ వంతు సహాయ సహకారాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సభ్యులు శ్రీకాంత్, బాలు, సంతు, నరేష్, గణేష్, భాస్కర్ తదితరులు ఆశ్రమంలోని వృద్ధులు, అనాధలకు ఉచితంగా హెయిర్ కట్టింగ్ సేవలు అందించారు. అంతేకాకుండా పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపారు. ఆశ్రమవాసులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పి మానసికంగా కూడా అండగా నిలిచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, సమాజంలో నిరుపేదలు, అనాధలు, వృద్ధులకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తమకు చేతనైనంత వరకు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కేవలం ఒకరోజు సేవతో కాకుండా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి సహాయం అందిస్తామని చెప్పారు. నాయీ బ్రాహ్మణ సంఘం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు, ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు. నేటి సమాజంలో స్వార్థం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనాధల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడమే తమకు లభించిన గొప్ప సంతృప్తి అని సంఘం సభ్యులు తెలిపారు. మానవత్వం, సేవాభావం కలిసినప్పుడు సమాజంలో మంచి మార్పు సాధ్యమవుతుందని, కిష్టారెడ్డిపేట పటేల్‌గూడ నాయీ బ్రాహ్మణ సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. సమాజంలోని ప్రతి వర్గం ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పలువురు కోరారు.

## ఈనెల 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి:

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్** : కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీఏ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య, ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని..ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా

## గోశాలకు డీసీఎం పచ్చగడ్డి, కూరగాయల విరాళం







మూగజీవాల సంరక్షణకు మార్వాడి సంఘం యువ నాయకుడు అరవింద్ మీర్జా ముందడుగు

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 16

మూగజీవాల పట్ల ప్రేమాభిమానాలు చాటుతూ శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో ఉన్న దయాన్ ఫౌండేషన్ గోశాలకు మార్వాడి సంఘం యువ నాయకుడు అరవింద్ మీర్జా, ఆధ్వర్యంలో సభ్యులు డీసీఎం నిండా పచ్చగడ్డి, కూరగాయలను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా అరవింద్ మీర్జా మాట్లాడుతూ, గోమాతల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గోశాలలోని మూగజీవాలకు ఆహారం అందించడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మార్వాడి సంఘం సభ్యులు మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా గోశాలలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మూగజీవాల సంక్షేమానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూనే ఉంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు మార్వాడి సంఘం అధ్యక్షుడు మనోజ్, మార్వాడి యువకులు వైష్ణవ్, పవన్ శర్మ, దినేష్ శర్మ, భీమ్ కుమార్, కాలు శర్మ, శంకర్ సింగ్, రాజ్ కుమార్ శర్మ, వినోద్ శర్మతో పాటు పలువురు మార్వాడి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మానవతా సేవలకు ముందడుగు.. రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్‌గా ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ,ఐఆర్‌సీఎస్ ప్యాట్రన్ మెంబర్ మామిడి భీమ్ రెడ్డి





తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 16

తెలంగాణ గవర్నర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS) సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, వాలంటీర్లు పాల్గొని రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు తమ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ మాట్లాడుతూ, మానవతా విలువలను కాపాడే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చే ప్రతి వ్యక్తి రెడ్ క్రాస్ కార్యకలాపాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సమాజానికి అవసరమైన సమయంలో సేవలందించే రెడ్ క్రాస్ వంటి సంస్థలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ మెంబర్‌గా సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఆర్‌సీఎస్ ప్యాట్రన్ మెంబర్ మామిడి భీమ్ రెడ్డి ఎమ్మెల్యేను అభినందించగా, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్యాట్రన్ మెంబర్ రోసీ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ సభ్యులు ఎం. దామోదర్ రెడ్డి, కె. సందీప్, రవికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావడంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా సాగింది. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు ఈ స్పందనే నిదర్శనంగా నిలిచింది.

తెలుగు జ్యోతి
అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక



# మియాపూర్ మంగళవారం మార్కెట్ యథావిధిగా కొనసాగాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**స్ట్రీట్ వెండర్ల సమస్యపై స్పందించి సీఆర్పీఎఫ్, పోలీసులతో చర్చలు**
**వ్యాపారాలకు అనుమతి**

తెలుగుజ్యోతి మియాపూర్ :16 జూన్:

మియాపూర్ డివిజన్ న్యూ కాలనీ శివాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్ వద్ద ప్రతి మంగళవారం నిర్వహించే మార్కెట్‌ను అడ్డుకోవడంతో స్ట్రీట్ వెండర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ఘటన స్థలానికి చేరుకుని వెండర్లతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.
సుమారు 20 సంవత్సరాలుగా ఇదే ప్రదేశంలో ప్రతి మంగళవారం కూరగాయలు, పండ్లు మరియు ఇతర చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న పేద వ్యాపారులను సీఆర్పీఎఫ్ మరియు స్థానిక



పోలీసులు అడ్డుకుంటున్నారని వారు తెలిపారు. దీనిపై స్పందించిన నేతలు సంబంధిత సీఆర్పీఎఫ్ అధికారులతో చర్చలు జరిపి, ప్రతి మంగళవారం అక్కడే మార్కెట్ నిర్వహించుకునేలా అనుమతులు కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద వ్యాపారుల జీవనోపాధిని అడ్డుకోవడం సరికాదని,



వారికి సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఎంపీ మరియు నాయకులకు మార్కెట్ వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ కిషోర్ యాదవ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, పట్టాభిరామ్, పవన్, విజయేందర్, శ్రీనివాస్, రాము, బసవ శివ, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకమ్మగూడలో గ్రామ సర్పంచ్ గొర్ల పల్లి అశోక్ జన్మదిన వేడుకలు..

పచ్చదనానికి శ్రీకారం --
విద్యార్థులకు పండ్ల పంపిణీ

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 16

జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ గ్రామానికి ఆదర్శంగా నిలిచారు వెంకమ్మగూడ గ్రామ సర్పంచ్ గొర్లపల్లి అశోక్. నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామం మాజీ వార్డు నెంబర్ వడ్డే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ గొర్ల పల్లి అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత చాటగా, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి చిన్నారుల ఆరోగ్యంపై తన ప్రత్యేక శ్రద్ధను వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనం పెంపొందించడం అత్యవసరమన్నారు.



అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. విద్యార్థులు సైతం సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ యాదయ్య, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి,



అంగన్‌వాడీ టీచర్ మన్నెమ్మ, వార్డు సభ్యురాలు సునీత రాజు, గ్రామస్తులు బుయ్యని వేణుగోపాల్ గౌడ్, గొల్లపల్లి మహేష్, రమేష్, శ్రీను, గణేష్, సురేష్, నందు, రాజు, అంజయ్య, శ్రావణ్, ప్రవీణ్, శరత్ పాల్వనడం తదితరులు పాల్గొన్నారు.

# పద్మనగర్, బాల్‌రెడ్డి నగర్‌లో డ్రైనేజీ దుస్థితి.. అధికారులు ఎప్పుడు మేల్కొంటారు?

**మురుగునీటితో ప్రజల నరకయాతన..**
**జలమండలి, మున్సిపల్ అధికారులు ఎక్కడ?**
**ఫిర్యాదులే ఫిర్యాదులు.. పరిష్కారం మాత్రం శూన్యం ఎందుకు?**
**పన్నులు కడుతున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేరా?**
**వ్యాధుల ముప్పు పొంచి ఉన్నా స్పందించని అధికారులు.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**
**జీడిమెట్ల సర్కిల్‌లో డ్రైనేజీ సమస్యలపై ప్రజల ఆగ్రహం..?**
**మురుగునీటిలోనే జీవనం..**
**అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల మండిపాటు..?**

తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల : జూన్ 16

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మనగర్, బాల్‌రెడ్డి నగర్ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలు నిత్యకృత్యంగా మారడంతో కాలనీలు మురుగునీటితో నిండిపోతున్నాయి. రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తుండగా, సమస్య పరిష్కారంలో జలమండలి మరియు మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధులు కూడా మురుగునీటితో నిండిపోయాయి. ఇండ్ల ముందు నిలిచిపోయిన మురుగునీటి కారణంగా ప్రజలు బయటకు రావడానికే ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఈ మురుగునీటిలోనే నడవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పాటు దోమల సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి







వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితిని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులకు రాతపూర్వక ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని కాలనీ వాసులు చెబుతున్నారు. సోషల్ మీడియా, గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేసినా అధికారులు కేవలం పరిశీలనకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకుడు

లవీర్ మాట్లాడుతూ, "మురుగు దుర్వాసన మధ్య జీవించడం శాపంగా మారింది. ప్రతి సంవత్సరం పన్నులు చెల్లిస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారా? లేక ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

## సంగారెడ్డిలో పోటీపై మరోసారి స్పష్టత నిచ్చిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.



తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 16 సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి తాను పోటు చేయడం లేదన్న జగ్గారెడ్డి. తన సతీమణి తూర్పు నిర్మలనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తుందని జగ్గారెడ్డి వెల్లడించారు. వందకి నోటొక్క శాతం తన భార్య శ్రీమతి తూర్పు నిర్మల పోటీ చేస్తుందని ప్రకటన చేసిన జగ్గారెడ్డి. 0.1% కూడా సంగారెడ్డి నుంచి పోటీ చేసే అవకాశం లేదన్న సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.

## శృంగేరి జగద్గురువుల ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

తెలుగు జ్యోతి న్యూస్ కుత్బుల్లాపూర్ : జూన్ 16



బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శ్రీ శృంగేరి శారదా పీఠాన్ని సందర్శించి జగద్గురువుల ఆశీస్సులు పొందారు. కర్ణాటకలోని దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠంలో జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగద్గురువులు ఆయనకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శృంగేరి శారదాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించి జగద్గురువుల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో శృంగేరి శిష్యులు రాచర్ల రవిచంద్ర శర్మతో పాటు పలువురు భక్తులు, పీఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీడిమెట్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్




మిషన్ భగీరథను నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
సమస్యలు పరిష్కరించకపోతే భారీ ఆందోళనలకు హెచ్చరిక

తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల :జూన్ 16

జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలో నెలకొన్న తాగునీటి కొరత, పారిశుద్ధ్య లోపాలు, డ్రైనేజీ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ 132వ డివిజన్ సమన్వయ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు కనీస అవసరమైన తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, గతంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో అమలు చేసిన మిషన్ భగీరథ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పాటు డ్రైనేజీ లీకేజీలు, పారిశుద్ధ్య సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని, పారిశుద్ధ్య నిర్వహణను బలోపేతం చేయాలని, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జీడిమెట్ల 132వ డివిజన్ సమన్వయ కమిటీ హెచ్చరించింది.

# ఎమ్మెల్యే కేపీ వివేకానంద రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ నాయకులు

దొడ్డిదారిన గెలిచిన ఎమ్మెల్యే గా కొనసాగే హక్కు లేదు
ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను విచారించాలి

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జూన్ 16

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేసి 2023లో జరిగిన ఎన్నికలలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గెలుపొందారని ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ ఆరోపించారు. మీడియా సమావేశంలో ఆలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మూడుసార్లు గెలిచి నేను హ్యాట్రిక్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నాడని అధికారాన్ని అడ్డుపెట్టుకొని గత ఎన్నికలలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హనుమంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేసి గెలుపొందారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గెలిచిన నైతికంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలను హనుమంత్ రెడ్డి గెలిచారని తెలిపారు. సిట్ విచారణలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ చేసిన ఫోన్ ట్యాపింగ్ న చూసి విస్తృత పోయామన్నారు .ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ టాపింగ్ చేసిన నేరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ను బర్తరఫ్ చేయాలని కోరారు. గత 12 సంవత్సరాల గా సంవత్సరాలుగా నేను ప్రగతి నగర్కు ఎన్నో చేశానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే ఒక పని కూడా చేయలేదని కనీసం రోడ్ల గుంతలను కూడా మరమ్మతులు చేయలేదని ప్రగతి నగర్ వైకుంఠధామం కబ్జాదారుల నుండి కాపాడి వాటి సమస్యను పరిష్కరించాలని మేము ఎన్నోసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కూడా కాలయాపనచేస్తూ పరిష్కరించలేకపోయాడని ఎమ్మెల్యే పదవి లేకపోయినా కొలను హనుమంత్ రెడ్డి ప్రగతి నగర్ వైకుంఠధామం సమస్య గురించి తెలుపగా వారు వెంటనే స్పందించి కబ్జాదారుల నుండి విడిపించి వైకుంఠధామం అభివృద్ధికి నిధులు తీసుకుని వచ్చారని తెలిపారు. వెంటనే అవినీతితో గెలిచిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ పై



సమగ్ర విచారణ జరిపి తన ఎమ్మెల్యే పదవిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డాక్టర్ మద్ది నారాయణరెడ్డి, గూడూరు మురళి కృష్ణ, ప్రశాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుబ్బు, సురేంద్ర యాదవ్, రఫిట్, తులసి దాస్, అరవింద నాయుడు, లోకనాథం తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ శ్రీకాంత్ మానవత్వం.. తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగింపు






తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల, జూన్ 16:

మానవత్వాన్ని చాటుతూ ఇద్దరు చిన్నారులను వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించిన ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌ను జీడిమెట్ల పోలీసులు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. జీడిమెట్ల పీఎస్ పరిధిలోని గాంధీనగర్ బస్ స్టాప్ వద్ద బీహార్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు తమ తల్లిదండ్రుల నుంచి విడిపోయి ఒంటరిగా కనిపించారు. చిన్నారుల పరిస్థితిని గమనించిన ఆటో డ్రైవర్ శ్రీకాంత్ వెంటనే స్పందించి వారిని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు చిన్నారుల వివరాలను సేకరించి, వారి కుటుంబ సభ్యులను గుర్తించే ప్రయత్నాలు చేపట్టారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులను గుర్తించి, వారిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ శ్రీకాంత్ చూపిన మానవత్వాన్ని పోలీసులు అభినందించారు. సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారులను క్షేమంగా పోలీసులకు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ప్రజలు కూడా ఇలాంటి సందర్భాల్లో బాధ్యతగా వ్యవహరించి తప్పిపోయిన పిల్లలను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# మల్లంపేటలో ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం..? విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం!









**ప్లేగ్రౌండ్ లేకపోయినా అనుమతులా..?**
**రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై ప్రశ్నలు**
**ఫిట్‌నెస్ లేని బస్సులు, పర్మిషన్ లేని భవనాలు.. అధికారులు ఎందుకు మౌనం?**
**"బుక్స్ మా దగ్గరే కొనాలి.. డ్రెస్సులు మా దగ్గరే కొనాలి" -- ఇది స్కూలా? వ్యాపార కేంద్రమా?**
**ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం..**
**ముడుపుల మాయలో అధికారులు?**

తెలుగు జ్యోతి న్యూస్ మల్లంపేట్ : జూన్ 16

మల్లంపేటలో ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆరోపణలు.. నిబంధనలు గాలికొదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారా? మల్లంపేట: మల్లంపేట ప్రాంతంలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై స్థానిక తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అధిక ఫీజులు వసూలు చేయడం నుంచి ప్లేగ్రౌండ్ లేకుండానే పాఠశాల నిర్వహణ వరకు అనేక అంశాలు వివాదాస్పదంగా మారాయి. తల్లిదండ్రుల కథనం ప్రకారం, ప్రతి సంవత్సరం ఫీజులను భారీగా పెంచుతున్నప్పటికీ అందుకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు లేదా ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు తప్పనిసరిగా స్కూల్ యాజమాన్యం సూచించిన చోటే కొనాలని ఒత్తిడి తెస్తున్నారని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థుల క్రీడా అభివృద్ధికి అవసరమైన ప్లేగ్రౌండ్ లేకపోయినా పాఠశాల నిర్వహణ కొనసాగుతుండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలకు చెందిన కొన్ని బస్సులు సరైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండానే నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల నిర్వహిస్తున్న భవనాలకు సంబంధించి పూర్తి అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పర్మిషన్ లేని భవనాల్లో విద్యాసంస్థలు నిర్వహిస్తే విద్యార్థుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాలపై పలుమార్లు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు కేవలం తనిఖీల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యలపై దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. కొందరు అధికారులు యాజమాన్యాలతో కుమ్మక్కై ముడుపులతో సరిపెట్టుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజలు, తల్లిదండ్రులు విద్యాశాఖ, మున్సిపల్, రవాణా శాఖల ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, భద్రతతో ముడిపడిన ఈ అంశంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రపంచ శాంతి పోరాట ఫలితమే అమెరికా ఓటమి ఇరాన్‌కు మద్దతుగా ఎమ్ సి పి ఐ (యు)




**యుద్ధ విరమణ ఒప్పందాన్ని స్వాగతించిన పార్టీ నేతలు**
**సామ్రాజ్యవాద విధానాలపై విమర్శలు**

తెలుగుజ్యోతి మియాపూర్ :16 జూన్ :

మియాపూర్ ముజఫర్ అహమ్మద్ నగర్‌లోని తాండ్ర రామచంద్రయ్య స్మారక భవనంలో జరిగిన సమావేశంలో ఎమ్ సి పి ఐ (యు)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇజ్రాయెల్ ఇరాన్‌పై జరిపిన యుద్ధం అభాసుపాలైందని, ప్రపంచ శాంతి కోరుకునే ప్రజల పోరాట ఫలితమే ఈ పరిణామమని అన్నారు. యుద్ధ విరమణ ఒప్పందాన్ని పార్టీ తరపున స్వాగతిస్తున్నట్లు తెలిపారు. భారత్ ప్రభుత్వం మోదీ నాయకత్వంలో సామ్రాజ్యవాద అనుకూల దేశంగా మారుతోందని విమర్శించారు. హిట్లర్, ముసోలినీల మాదిరిగానే యుద్ధోన్మాద రాజకీయాలకు ముగింపు తప్పదని హెచ్చరించారు. దేశంలో బీజేపీ పాలన నియంతృత్వం, ఫాసిజం వైపు నడుస్తోందని ఆరోపిస్తూ, సి బి ఐ , ఈ డి , ఎన్నికల కమిషన్ వంటి సంస్థలు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ వరుసగా రెండో ఏడాది లీక్ కావడం తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైపూర్‌లో కాకురోచ్ జనతా పార్టీ నేత అభిషేక్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇది పిరికిపందల చర్యగా పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమవుతోందని, కాంట్రాక్ట్ విధానంతో లాభాపేక్ష పాలన కొనసాగుతోందని విమర్శించారు. హైదరాబాద్‌ను తెలంగాణ సమాజానికి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని పేర్కొంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వనం సుధాకర్, మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్ కుమార్, కర్ర దానయ్య, తాండ్ర కళావతి, పి. బాగ్యమ్మ, పల్లె మురళి, యల్. రాజు, డి. మధుసూదన్, యం.వై. కుమార్ పాల్గొన్నారు.

## ఎంఎన్ఆర్ స్కూల్ ఫీజుల వివాదం విద్యార్థి నాయకులపై కేసులు ఉపసంహరణకు డిమాండ్

**అధిక ఫీజులు, బలవంతపు అమ్మకాలపై ఫిర్యాదులు**
**చర్యలు లేకపోవడంతో నిరసన, తర్వాత కేసులు నమోదు**

తెలుగుజ్యోతి మియాపూర్ :16 జూన్ :



హైదరాబాద్ మియాపూర్‌లోని ఎంఎన్ఆర్ స్కూల్‌లో అధిక ఫీజులు, లేట్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఫీజులు, పుస్తకాలు మరియు యూనిఫాంల బలవంతపు అమ్మకాలపై తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో వివాదం నెలకొంది. ఈ అంశంపై ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి 30-04-2026న శేరిలింగంపల్లి ఎంఈఓకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆదేశాలు వచ్చినప్పటికీ ఎంఈఓ స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థి నాయకులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాలకు వెళ్లి సమస్యల పరిష్కారం కోరారు. ఈ నేపథ్యంలో అక్రమ ఫీజులను ప్రశ్నించిన విద్యార్థి నాయకులు పల్లె మురళి, ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్, బీఆర్ఎస్‌వీ యమలవలస రాజు పై ఖీ×= నెం. 891/2026 ద్వారా బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 329(3), 351(2), 324(4), 352 తీ/ష 3(5) కింద కేసులు నమోదు చేయడం వివాదాస్పదంగా మారింది. ఏఐఎఫ్‌డీఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ముత్తన్నగారి శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థి నాయకులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంఎన్ఆర్ స్కూల్‌పై సమగ్ర విచారణ జరిపి, బలవంతపు అమ్మకాలు, అధిక ఫీజుల వసూళ్లను నిలిపివేయాలని, తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన అక్రమ మొత్తాలను తిరిగి చెల్లించాలని కోరారు. ఇక డీఈఓ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య హక్కు కోసం పోరాడటం నేరం కాదని, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# పచ్చదనమే భవిష్యత్తు.. సీడీ తాండలో విస్తృత మొక్కల నాటుతున్న గ్రామ సర్పంచ్ గబ్రు చౌహాన్

తెలుగు జ్యోతి న్యూస్ షాద్‌నగర్ ప్రతినిధి జూన్ 16

పర్యావరణ పరిరక్షణే భావితరాలకు గొప్ప కానుక అని నందిగామ మండలంలోని సీడీ తాండ, ఆర్కేఆర్ గ్రామాల్లో నిర్వహించిన మొక్కల నాటకం కార్యక్రమంలో సర్పంచ్ గబ్రు చౌహాన్ పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులతో కలిసి మొక్కలు నాటిన ఆయన, చెట్లు మానవాళి మనుగడకు మెట్లవంటివని, వృక్షాలను సంరక్షిస్తే అవే మన జీవనాధారాన్ని కాపాడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను పెంచి పెద్దవిగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే కాలుష్యం తగ్గి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్ నాయక్, సెక్రటరీ రవీందర్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల వైపు అడుగులు..**

**సిద్ధాపూర్‌లో బడిబాటకు విశేష స్పందన**

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బాసు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన కిట్లు, పోషకాహారం, ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, గుడ్లు, రాగి జావ, పాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే భవిష్యత్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదయ్య, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

**పెంజర్లలో 'అమ్మ మాట--అంగన్‌వాడీ బాట'..**

**చిన్నారులకు యూనిఫాంల పంపిణీ**

బాల్యంలోనే విద్యకు పటిష్టమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని కొత్తూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. పెంజర్ల గ్రామంలో నిర్వహించిన 'అమ్మ మాట--అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ప్రధానోపాధ్యాయులు రఘుపతి రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గూడూరులో అంగన్‌వాడీ బాటకు విశేష స్పందన**

**చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే బలమైన పునాది : సర్పంచ్ దయానంద్ గుప్తా**











చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గూడూరు గ్రామ సర్పంచ్ దయానంద్ గుప్తా పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో నిర్వహించిన 'అమ్మ మాట--అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, చిన్నారులతో కలిసి అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది సమిష్టిగా కృషి చేసినప్పుడే చిన్నారుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జేపీసీ ధర్నాలతో దిగివచ్చిన హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్

**జేపీసీ చేసిన ధర్నాకు నీటిని సరఫరా చేసిన వాటర్ బోర్డ్స్ హెచ్ఎండబ్ల్యూఎస్ జిఎం నాగపరిమళ కు ధన్యవాదాలు తెలిపిన జేపీసీ**

**14 ఎం జి డి అనుమతులు ఇప్పించగలిగితే కాంగ్రెస్ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతాం**

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జూన్ 16





నిజాంపేట్ ప్రగతి నగర్ లో నీటి సరఫరా సరిగా జరగడంలేదని ప్రజలు జేపీసీగా ఏర్పాటయి సోమవారం ర్యాలీ నిర్వహించి వాటర్ ట్యాంక్ దగ్గర నిర్వహించిన ధర్నాకు స్పందించి మంగళవారం నిజాంపేట సర్కిల్ హెచ్ ఎం డబ్ల్యు ఎస్ జిఎం నాగ పరిమళ స్పందించి మంగళవారం నాడు పూర్తిస్థాయిలో మంచినీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు రామకృష్ణారెడ్డి, ఆకుల సతీష్ మాట్లాడుతూ సోమవారం చేసిన జేపీసీ ధర్నాకు దిగివచ్చిన వాటర్ బోర్డ్ అధికారులు, వాటర్ బోర్డ్ జిఎం నాగ పరిమళ ఈరోజు 10 ఎమ్ ఎల్ నీటిని ప్రగతి నగర్ కి అందించడం సంతోషకరమన్నారు. రేపటికల్లా ప్రగతి నగర్ మొత్తం మంచినీటి సరఫరా జరుగుతుందని ప్రగతినగర్ కు నీటిని సరఫరా చేస్తామన్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. అధికారులు ఇదేవిధంగా ప్రతిరోజు నీరు సప్లై చేయడానికినిజాంపేట్ సర్కిల్ మొత్తానికి 14 ఎంజిడీ అవసరం అవుతుందని, ఈ వాటర్ ప్రతిరోజు రావాలి అంటే టి ఏ ఓ అనుమతి వాటర్ వర్క్స్ ఎండి ఇవ్వాల్సి ఉంటది. గత టిఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇప్పించలేకపోయారు-ప్రస్తుత ప్రభుత్వం 14 ఎం జి డి ఆర్డర్ ఇప్పించగలిగితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒ కుత్బుల్లాపూర్ ఇన్చార్జి కొలన్ హనుమంత్ రెడ్డికి కి బహిరంగంగా ప్రెస్ మీట్ పెట్టి ధన్యవాదాలు చెప్తాశీ అని తెలిపారు.

# రామ్‌కీ దోసా హోటల్ పార్కింగ్ దౌర్జన్యం..







**ప్రజల ప్రాణాల కంటే హోటల్ వ్యాపారమే ముఖ్యమా.. అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు.. రాజకీయ అండదండలున్నాయా..**

పటాన్చెరు జూన్ 16 తెలుగు జ్యోతి

బీరంగూడ కిష్టారెడ్డిపేట ప్రధాన రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రింగ్ రోడ్డుకు అనుసంధానమయ్యే ఈ కీలక మార్గంలో ఉన్న రామ్‌కీ దోసా హోటల్ ఎదురుగా ఉన్న యూ-టర్న్ ప్రాంతాన్ని హోటల్ యాజమాన్యం తమ వ్యక్తిగత పార్కింగ్ స్థలంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
స్థానికుల కథనం ప్రకారం, భారీ వాహనాలు సులభంగా తిరగడానికి ఏర్పాటు చేసిన యూ-టర్న్ ప్రాంతంలో హోటల్‌కు వచ్చే వాహనాలను వరుసగా నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా స్కూల్, కాలేజీ సమయాల్లో ఉదయం మరియు సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
రోడ్డుపై నిలిపివేసిన వాహనాల కారణంగా భారీ లారీలు, బస్సులు యూ-టర్న్ తీసుకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని, వాహనాలు ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని చెబుతున్నారు. ఇది హైవేనా.. లేక హోటల్ పార్కింగా. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజా రహదారిని కొందరి వ్యాపార అవసరాల కోసం వినియోగించడం ఎంతవరకు సమంజసం అని నిలదీస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఎందుకు వెనుకాడుతున్నారు.. ఎవరి ఒత్తిళ్లు పనిచేస్తున్నాయి.. రాజకీయ నాయకుల అండదండలున్నాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు, రోడ్డు భద్రతా విభాగం అధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. యూ-టర్న్ ప్రాంతాన్ని పూర్తిగా ఖాళీ చేయించి, అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రత కంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమా అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని స్థానికులు అంటున్నారు. ఒకవేళ రేపు ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రామ్‌కీ దోసా హోటల్ ఎదురుగా జరుగుతున్న అక్రమ పార్కింగ్ వ్యవహారంపై విచారణ జరిపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే చర్యలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల రోడ్డు ప్రజలకే కావాలి... ప్రైవేట్ పార్కింగ్‌కు కాదు

**అధికారుల మౌనం వెనుక అసలు కారణం ఏమిటి.**

ప్రమాదం జరిగాక స్పందిస్తారా... ముందే చర్యలు తీసుకుంటారా..

# వాక్సెన్ యూనివర్సిటీలో భారతదేశంలోని అతిపెద్ద ఆర్కిటెక్చర్ సమావేశాలలో ఒకటి - 68వ వార్షిక NASA కన్వెన్షన్‌కు 5,000ం మంది హాజరు







తెలుగు జ్యోతిలిహైదరాబాద్, 16 జూన్,

2026: వాక్సెన్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో జూన్ 11 నుండి 14 వరకు 68వ వార్షిక రూబాకా కన్వెన్షన్ (రూచీజ) 2026 విజయవంతంగా నిర్వహించబడింది. ఈ నాలుగు రోజుల కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 4,500 మందికి పైగా ఆర్కిటెక్చర్ విద్యార్థులు, 500 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, విద్యావేత్తలు, పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలు హాజరయ్యారు. వాక్సెన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్లానింగ్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (NASA India) సహకారంతో ఈ కన్వెన్షన్‌ను నిర్వహించింది.

**ముఖ్యాంశాలు:**

ప్రధాన వక్తలు: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఆర్కిటెక్ట్ ాూతీ. కెవిన్ మార్క్ లో (మలేషియా), ఆర్కిటెక్ట్ మరియు విద్యావేత్త ాూతీ. నూరు కరీమ్, ప్రఖ్యాత ఆవిష్కర్త సోనమ్ వాంగ్చుక్ ప్రత్యేక ఆకర్షణ: ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు అమాల్ మల్లిక్ లైవ్ పెర్ఫార్మెన్స్ కార్యక్రమాలు: 10 మాస్టర్‌క్లాస్‌లు, 20 సెమినార్లు, 60 వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చలు, ఎగ్జిబిషన్లు **అంశాలు:** ఆర్కిటెక్చర్, సస్టైనబిలిటీ, అర్బన్ డెవలప్‌మెంట్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, హెరిటేజ్ కన్జర్వేషన్ అకడమిక్ హైలైట్: NASA India Research Conference 2వ ఎడిషన్ పోటీలు: రూబెన్స్ ట్రోఫీ, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ట్రోఫీ, GRIHA ట్రోఫీ, వార్షిక రూబాకా డిజైన్ కాంపిటీషన్ ఫైనల్ జ్యూరీలు భారతదేశంలోని అతిపెద్ద విద్యార్థుల ఆధ్వర్యంలో నడిచే ఆర్కిటెక్చర్ సమావేశాలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ కన్వెన్షన్, ఆర్కిటెక్చరల్ చర్చ, డిజైన్ ఇన్నోవేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్‌కు వేదికగా నిలిచింది.

**వాక్సెన్ యూనివర్సిటీ గురించి:**

తెలంగాణలోని మొదటి ప్రైవేట్ యూనివర్సిటీలలో ఒకటైన వాక్సెన్ 200 ఎకరాల క్యాంపస్ కలిగి ఉంది. బిజినెస్, టెక్నాలజీ, ఆర్ట్స్ డిజైన్, ఆర్కిటెక్చర్, లా, లిబరల్ ఆర్ట్స్‌లో కోర్సులు అందిస్తోంది. QS Business Masters World Ranking 2025లో #9 ఆల్ ఇండియా, Outlook I-CARE ర్యాంకింగ్స్‌లో దీ. Arch ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ 3 సాధించింది.

# 12 ఏళ్లలో ఎమ్మెల్యే చేయలేనిది.. బీజేపీ కృషితో 4 కోట్ల స్కూల్ నిర్మాణం!

**మదీనాగూడా ప్రభుత్వ పాఠశాల పునర్నిర్మాణానికి భూమిపూజ**

**విర్టూసా ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధులతో ఆధునిక భవనం**

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేత రవికుమార్ యాదవ్ పాల్గొనడం**

**శేరిలింగంపల్లి:** హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడా గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల పునర్నిర్మాణానికి మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. విర్టూసా (ఎతితీబిబీబజీ) ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, కంపెనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సి.ఎస్.ఆర్ నిధులను వినియోగించేందుకు ముందుకు వచ్చిన విర్టూసా ఫౌండేషన్‌ను అభినందించారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "12 సంవత్సరాలుగా స్థానిక ఎమ్మెల్యే చేయలేని పనిని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో బీజేపీ నాయకుల కృషితో సాధించగలిగాం. బీజేపీ మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించే పార్టీ. మదీనాగూడా పాఠశాల పునర్నిర్మాణం ఇందుకు నిదర్శనం" అని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరిన్ని సంస్థలు సి.ఎస్.ఆర్ నిధులతో ముందుకు రావాలని ఆయన కోరారు. కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం సందర్భంగా స్థానిక ప్రజలు మదీనాగూడా పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు కృష్ణ ఎద్దుల, వాసు, ఇందార్, పూజా, సుబ్బారావు, సురేష్ బాబు, అరుణ, కేవీ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జితేందర్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్, విజయేందర్, పద్మ, వినయ, బిందు, శ్రీనివాస్ యాదవ్, మనోజ్, ప్రసాద్ రెడ్డి, శ్రీశైలం కురుమ, పార్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు ప్రతీకగా వెంకమ్మగూడ సర్పంచ్ అశోక్.. జన్మదిన వేడుకలు ఘనంగా



సన్మానించిన సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్, చేగుర్ గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 16

నందిగామ, ప్రజాసేవలో ముందుండి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వెంకమ్మగూడ గ్రామ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, నందిగామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, చేగూర్ గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్ తదితరులు అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేయించి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ అశోక్ చూపుతున్న చొరవ ఆదర్శనీయమని కొనియాడారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కావలి కృష్ణ, నరసింహ, రాంచంద్రి, అభి తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని సర్పంచ్ అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# అనాథకు ఆపద్బాంధవుడిగా నిలిచిన ఎం.డి.ఆర్ ఫౌండేషన్

పటాన్‌చెరు, జూన్ 16: తెలుగు జ్యోతి





ఈ రోజుల్లో మనిషి మనిషికి దూరమవుతున్న తరుణంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఎం.డి.ఆర్ ఫౌండేషన్ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకుంది.
పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో జీవనం సాగిస్తున్న ఓ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మూడు రోజుల పాటు బంధువుల కోసం విస్తృతంగా ప్రయత్నించినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ వృద్ధుడు అనాథగా మిగిలిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఎం.డి.ఆర్ ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అన్ని సంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు లేకపోయినా, ఆ వృద్ధుడికి కుటుంబ సభ్యుల్లా చివరి వీడ్కోలు పలికారు. "జీవించి ఉన్నప్పుడు చేయూత అవసరం... మరణించిన తర్వాత గౌరవం అవసరం" అనే సందేశాన్ని ఎం.డి.ఆర్ ఫౌండేషన్ తన సేవల ద్వారా సమాజానికి చాటుతోంది. సమాజం మరచిపోయిన వారిని సైతం మనుషులుగానే చూసే సంస్కృతి మనలో పెరగాలని ఈ ఘటన గుర్తు చేస్తోంది. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం కేవలం సేవ మాత్రమే కాదు, అది ఒక మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడే పవిత్రమైన బాధ్యత. ఎవరూ లేని చోట అండగా నిలవడం, గుర్తింపు లేని జీవితానికి గౌరవం ఇవ్వడం, మానవత్వాన్ని నిలబెట్టడం ఎం.డి.ఆర్ ఫౌండేషన్ సేవల ప్రత్యేకతగా నిలుస్తోంది.

**ఈ ఘటన ప్రతి ఒక్కరిలోనూ ఒక ప్రశ్నను మిగులుస్తోంది...**

మన చుట్టూ ఉన్న నిరుపేదలను, అనాథలను మనం ఎంతవరకు పట్టించుకుంటున్నాం. మనిషికి మనిషే తోడుగా నిలిచినప్పుడే సమాజం గొప్పదవుతుంది. అలాంటి మానవతా విలువలు ప్రతి ఒక్కరిలో చిగురించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# డీ, సుజాత విద్యానందం పెళ్లిరోజు వేడుకలు నిర్వహించారు.

పెళ్లిరోజు వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ డైరెక్టర్, డీ ప్రేమానందం.

తెలుగు జ్యోతి న్యూస్ 16 జూన్
సంగారెడ్డి ప్రతినిధి.





సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం చర్ల గోపులారం గ్రామ పంచాయతీ మెంబర్, డీ సుజాత విద్య నందం వివాహ మహోత్సవ వేడుకలు వారి నివాసంలో జరిపినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ జి. మహేశ్వరి సతీష్, గ్రామపంచాయతీ సభ్యులు జి నవీన్, అంతయ్య పల్లె రవి మెంబర్, ఎం వీరమని కిష్టయ్య నెంబర్, రాజ్ కుమార్, రాజశేఖర్, డి మధుకర్, డి మాధవి, మమత వారి బంధువులు కుటుంబ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి పూల మాలలతో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223